ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 4 సెప్టెంబరు 2025 | 5





150 రకాల స్వీట్లతో విఘ్నేశ్వరుడికి నివేదన

మామిడికుదురు మండలంలోని మగటపల్లి విఘ్నేశ్వరుడికి 150 రకాలతో స్వీట్లతో నివేదన సమర్పించిన భక్తులు

చమురు సంస్థలపై ప్రజాప్రతినిధుల.. పోరుబాట!

- సీఎస్సార్ నిధులు కేటాయించాలి
- లేకుంటే అక్టోబరు నుంచి వాహనాలు నిలిపివేస్తాం
- కలెక్టర్ అధ్యక్షతన జరిగిన భేటీకి మంత్రి సుభాష్‌తోపాటు జిల్లా ఎమ్మెల్యేలు హాజరు



కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన చమురు సంస్థల ప్రతినిధుల భేటీలో పాల్గొన్న కార్మికశాఖ మంత్రి సుభాష్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు

అమలాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చమురు,సహజ వాయువుల నిక్షేపాల అన్వేషణలో భాగంగా ఓఎన్జీసీ, గెయిల్, వేదాంత సంస్థలు ఆర్జించే లాభాల్లో ఆయాప్రాంతాల అభివృద్ధికి సీఎస్సార్ నిధులను కేటాయించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కీలక ప్రజాప్రతినిధుల భేటీలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కోనసీమకు చెందిన ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవవరప్రసాద్‌తోపాటు చమురు సంస్థలకు చెందిన అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. చమురుసంస్థలు నిర్వహించే డ్రిల్లింగ్ సైట్‌లనుంచి ఇతర బావులను అనుసంధానంచేస్తూ వేసే పైపులైన్లు ఉన్న రహదారుల్లో భారీ వాహనాలు వెళ్లేలా వంతెన నిర్మాణ వ్యయాన్ని కేటాయించి అభివృద్ధికి సహకరించాలని మంత్రి సుభాష్ విజ్ఞప్తిచేశారు. గత రెండేళ్లలో సీఎస్సార్ కింద కేటాయించిన నిధుల వినియోగం, రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. చమురుసంస్థలు లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని, ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సీఎస్సార్ ఫండ్ కేటాయించి ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలని మంత్రి సుభాష్ చమురు సంస్థల అధికారులకు విజ్ఞప్తి చేశారు. తొలుత కలెక్టర్ మహేష్‌కుమార్ సంస్థలవారీగా గత రెండేళ్ల సీఎస్సార్ నిధులు వాటి వినియోగంపై సమీక్ష చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో సీఎస్సార్ నిధుల కేటాయింపుపై ఓఎన్జీసీ ఈడీలు సమావేశం నిర్వహించాలని కోరినప్పటికీ వారు ఆసక్తి చూపడంలేదని ఆరోపించారు. తన నియోజకవర్గంలో రూ.5కోట్లతో మంచినీటి పథకాన్ని ప్రతిపాదించామని, నిధులు కేటాయించి పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే ప్రస్తావించగా ఓఎన్జీసీ సీజీఎం కేవీకే రాజు సమాధానమిస్తూ త్వరలో వీటిని ప్రారంభిస్తామని ప్రకటించారు. వంతెనలు, రోడ్లు ఉపయోగించుకుని భారీ వాహనాలను నడిపిస్తున్న చమురు సంస్థలు ప్రాజెక్టు వ్యయంలో భాగస్వామ్యం వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాశర్లపూడిలో నెలకొన్న సమస్యలపై వెంటనే అధికారులు స్పందించి బాధితులకు నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. 20ఏళ్లుగా ఎస్.యానాం ప్రాంతానికి వాహనాలు భారీగా వెళ్తున్నాయని, రోడ్లు అధ్వానంగా తయారు కావడంవల్ల రూ.78కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రస్తావించారు. వీటిపై వేదాంత కంపెనీ నుంచి ఏవిధమైన స్పందన లేదన్నారు. రోడ్లు, వంతెనల అభివృద్ధిపై స్పందన లేకపోతే అక్టోబరు నెలాఖరునుంచి ఓఎన్జీసీ వాహనాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. అక్టోబరు మొదటివారంలో కంపెనీల ఈడీలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. వేదాంత సంస్థ రూ.లక్షా 50వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రాంత అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చూపుతూ సీఎస్సార్ నిధులు అరకొరగా కేటాయిస్తున్నారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. నిబంధనల ప్రకారం వచ్చిన లాభాల్లో 2శాతం సీఎస్సార్‌గా కేటాయించాలని కోరారు. సీఎస్సార్ కింద ఏడాదికి రూ.100కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. నగరానికి సంబంధించి 12 డిమాండ్లను పరిష్కరించాలని ఎమ్మెల్యే గెయిల్ అధికారులకు సూచించారు. ఇలా అనేక సమస్యలను ఓఎన్జీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం నిమిత్తం కృషి చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 550 డ్రిల్లింగ్ సైట్లకు వెళ్లే రోడ్లను మ్యాపింగ్ చేస్తూ బ్రిటీషు కాలం నాటి వంతెనలు బలహీనపడినచోట్ల వాటిని పునర్నిర్మించేందుకు సీఎస్సార్ నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఓఎన్జీసీ కాకినాడకు చెందిన అధికారి సునీల్‌కుమార్, ఓఎన్జీసీ జీఎం మజుందార్, గెయిల్ ప్రతినిధులు ప్రభాకరరావు, వేదాంత సీఎస్సార్ ప్రతినిధి సుమన్‌దేవ్, సీపీవో మురళీకృష్ణ భేటీలో పాల్గొన్నారు.అమలాపురం ఎంపీ హరీష్ లేకుండానే ఓఎన్జీసీ సంస్థల ప్రతినిధులతో ఎమ్మెల్యేల భేటీపై ఎంపీ వర్గీయులు గుర్రుగా ఉన్నారు.

మరోసారి..

- జిల్లాలో 9 మద్యం బారు లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం
- 14 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 15న డ్రా
- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేణుక



అమలాపురంటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మద్యం బార్ లైసెన్సులను పొందేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. జిల్లాలో తొమ్మిది బార్ లైసెన్సులు పొందేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 14వతేదీ సాయంత్రం 6గంటల వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తామని అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ కమిషనర్ డి.రేణుక బుధవారం తెలిపారు. తొలి విడతలో పురపాలక సంఘాలు, నగర పంచాయతీ,టూరిజం సెంటర్‌లో 9 బార్ల ఏర్పాటుకు, 2బార్‌లు గీత కార్మికులకు కేటాయించారు. రామచంద్రపురం పట్టణంలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం బార్‌కు ఒకరు లైసెన్సు పొందగా అమలాపురంలో గీత కార్మికులకు కేటాయించిన బార్‌కు ఈసారి మరోసారి అవకాశం కల్పించారు. పురపాలక సంఘాలకు సంబంధించి తొలివిడతలో తొమ్మిది బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా ఒక్కరు మాత్రమే అమలాపురం నుంచి లైసెన్సును దక్కించుకున్నారు. ప్రస్తుతం రెండో విడతలో అమలాపురం 2, రామచంద్రపురం 2, మండపేట మున్సిపాలిటీ 2, ముమ్మిడివరం నగర పంచాయతీ 1, టూరిజానికి సంబంధించి దిండిలో 1 బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అమలాపురంలో గీతకార్మికులకు కేటాయించిన బార్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. అమలాపురం, మండపేట పురపాలక సంఘాల పరిధిలో గతంలో మాదిరిగానే లైసెన్సు ఫీజు రూ.55లక్షలు కాగా రామచంద్రపురం, ముమ్మిడివరం, దిండి బార్‌లకు రూ.35లక్షలు చెల్లించాల్సి ఉంది. గీత కార్మికులకు కేటాయించిన షాపునకు రూ.27.50లక్షలు చెల్లించాల్సి ఉంది. యథావిధిగా రూ.5లక్షల చొప్పున దరఖాస్తు ఫీజు, రూ.10వేల ప్రాసెస్ ఫీజుగా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెల 14వతేదీ సాయంత్రం 6గంటల్లోగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు అందించవచ్చునన్నారు. 15వతేదీ ఉదయం 8 గంటలకు అమలాపురం కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి భవన్‌లో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని చెప్పారు. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు తప్పనిసరి కాగా డ్రాలో తగిలిన వారికి అప్పటికప్పుడు లైసెన్సు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 7989518676, సీనియర్ అసిస్టెంట్ సెల్ 8885758575 నెంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.



సెస్ నిధులు.. ఏమైపోతున్నాయి?

- నిధుల లేమితో అల్లాడుతున్న స్వర్ణ పంచాయతీలు
- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ప్రభుత్వం చర్యలు
- అరువులు.. అప్పులతోనే పంచాయతీ పాలన

అమలాపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరుసగా వరదలు వస్తున్నాయి. దానికితోడు వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం సీజన్ మారింది. దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వాటి గండం నుంచి బయటపడాలన్నా, ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నా, పంచాయతీలకు ముందుగా ముగ్గు, బ్లీచింగ్ తప్పనిసరి. అవి కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కొన్ని పంచాయతీలకు మాత్రమే ఉంది. మిగిలిన పంచాయతీలు ఏజెన్సీల వద్ద రికార్డుపూర్వకంగా అరువు తీసుకోవాల్సిందే. ఇక పారిశుధ్య పనులు చేసే కార్మికులకుగానీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు కూడా నెలల తరబడి చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

నిధుల లేమితో ఇబ్బందులు

జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటన్నింటినీ ఇప్పుడు స్వర్ణ పంచాయతీలుగా మార్చి ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ఇవి నిధుల లేమితో అల్లాడిపోతున్నాయి. పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి పంచాయతీలకు రావాల్సిన సీనరేజీ సెస్, రిజిస్ట్రేషన్ సెస్ నిధులు ఏమైపోతున్నాయి. ఏడాది గడిచిపోయినా ఆ సెస్ నిధులు విడుదల కాక సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితికి పంచాయతీలు చేరుకున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు వంటి కనీస మౌలిక వసతులు కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిధుల విడుదలకు ఆర్థికశాఖ చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సొమ్ముల జమ ఏది?

జిల్లాలో మెట్రిక్ టన్నుల కొద్దీ ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. దీనిపై ఎప్పటికప్పుడు సీనరేజీ సెస్ వసూలు చేస్తున్నారు. కానీ ఆ సెస్ సొమ్ములు మాత్రం పంచాయతీలకు జమ కావడంలేదు. ఇక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల క్రయ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా విక్రయాలపై రిజిస్ట్రేషన్ సెస్ (స్టాంప్ డ్యూటీ) వసూలు చేస్తున్నారు. స్టాంప్ డ్యూటీ కింద ఓ పాటి మేజర్ పంచాయతీకి ఏడాదికి రూ.12లక్షలు ఆదాయం వస్తుంది. ఇలా జిల్లాలోని పంచాయతీలకు కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ బకాయిలు ఉండిపోయాయి. సెస్ సొమ్ముల గతంలో ఆయా శాఖల నుంచి నేరుగా మూడు నెలలకు ఒకసారి పంచాయతీలకు జమవుతూ ఉండేవి. ఈ విధానం ఎక్కడో గాడి తప్పింది. ఎప్పుడు గాడిన పడుతుందో తెలియదు. సెస్ సొమ్ములకోసం జిల్లాఉన్నతాధికారుల చుట్టూ స్థానిక ప్రజాప్రతినిధులు తిరిగినా ప్రయోజనం ఉండడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శక స్వర్ణ పంచాయతీలు

ఇప్పటివరకు ఇంటి పన్నులను మాన్యువల్‌గా వసూలు చేసి బ్యాంకులకు జమ చేసేవారు. ఆ తర్వాత ట్రెజరీ ద్వారా ఆయా పంచాయతీల జనరల్ ఫండ్‌కు ఆ నిధులు జమయ్యేవి. ఇక ఆ విధానానికి స్వస్తి పలికి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ఏర్పాటుచేసింది. దీని ద్వారా ప్రతి పంచాయతీకి ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసింది. ఇంటిపన్ను చెల్లించాల్సిన వ్యక్తికి ముందుగానే సెల్‌ఫోన్‌లో మెస్సేజ్ వెళ్తుంది. ఆ తర్వాత ఇంటినుంచే క్యూఆర్ కోడ్‌కు పన్ను సొమ్ములు సంబంధిత యజమాని నేరుగా చెల్లించాలి. పంచాయతీ సొమ్ములు ఎక్కడా పక్కదారి పట్టకుండా ఆన్‌లైన్ పేమెంట్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతిఒక్కరూ ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

ఇంటి పన్నులే ఆధారం

గ్రామ పంచాయతీల్లో వసూలు చేసిన ఇంటి పన్నులతోనే అభివృద్ధి పనులు చేసుకుంటున్నారు. ఏడాదికోసారి ఇంటి పన్నులు వసూలు చేసే సరికి అప్పటికే వసూలయ్యే సొమ్ముల కంటే ఎక్కువగా గ్రామాల్లో పాలకవర్గాలు పలుచోట్ల అభివృద్ధి పనులు చేస్తుండడంతో బాకీలే మిగులుతున్నాయి. ఎప్పటికప్పుడు సీనరేజీ సెస్, స్టాంప్ డ్యూటీ సొమ్ములు వస్తే సిబ్బంది జీతాలు చెల్లించగలుగుతామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. మేజర్ పంచాయతీల్లో నాలుగునెలలుగా స్వీపర్లు, ఇతర సిబ్బందికి జీతాలు చెల్లించలేదని దుస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల పారిశుధ్య కార్మికులు జీతాలు చెల్లించకపోతే తాము ఎలా బతికేది అని భీష్మించడంతో అప్పులు చేసి మరీ వేతనాలు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ పాలనను గాడినపెట్టేలా చర్యలు తీసుకుని సకాలంలో సెస్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా విడుదలైతేనే గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ గాడిన పడుతుంది. అరువులు, అప్పులతో మూలుగుతున్న పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరుస్తూ స్థానిక స్వపరిపాలన వైపు మళ్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కార్పొరేషన్లకు ఆరుగురు డైరెక్టర్ల ఎంపిక

అమలాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఆరుగురు నేతలకు కార్పొరేషన్ పదవులు వరించాయి. జిల్లాలోని పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందిన కూటమి నేతలను పలు కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఐడీఎస్ఎల్) డైరెక్టర్‌గా పి.గన్నవరం నియోజవర్గానికి చెందిన మట్టపర్తి బాలభారతి, ఏపీకుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలెప్‌మెంట్ డైరెక్టర్‌గా మచ్చారప విజయకుమారి, నాటక అకాడమీ డైరెక్టర్లుగా రామచంద్రపురానికి చెందిన పెంకే అన్నపూర్ణ, పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన చెల్లుబోయిన గంగాదేవి, రాజోలు నియోజకవర్గానికి చెందిన బందెల పద్మ, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ డైరెక్టరుగా అమలాపురం నియోజకవర్గానికి చెందిన అయితాబత్తుల ఉమామహేశ్వరరావులను నియమిస్తూ ఉత్తర్వులు బుధవారం అందాయి.

కోనసీమ రైల్వేలైన్ పనులను మరింత వేగవంతం చేయాలి: ఎంపీ హరీష్



దక్షిణ మధ్యరైల్వే సమావేశంలో పాల్గొన్న ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులు తొలగిపోవడంతో రైల్వేనిర్మాణానికి మార్గం సుగమం అయినందున పనులను మరింత వేగవంతం చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో బుధవారం ఏర్పాటుచేసిన 76వ దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. రైల్వే జీఎం సంజయ్‌కుమార్‌శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌పై ఉన్న కోర్టు కేసులు తొలగిపోయాయన్నారు. పనులు వేగవంతం చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. త్వరితగతిన గోదావరి నదులపై బ్రిడ్జి స్ట్రక్చర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ వసతుల కల్పన కోసం సూచించిన విధంగా చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాజోలు పరిధిలోని దిండి వద్ద గోదావరి నదిలో వంగిన పిల్లర్‌పై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కోనసీమ ప్రయాణికుల అవసరాల దృష్ట్యా అమలాపురం పట్టణంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ హరీష్‌బాలయోగి కోరారు.

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కల సాకారం అయిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారన్నారు. పేరూరు డీఎన్‌శెట్టి, డీవీ రెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయ గది, కంప్యూటర్ ల్యాబ్, మూడు తరగతి గదులను డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడులతో కలిసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో మూడు డిగ్రీ కోర్సులతో కళాశాలను ప్రారంభించామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరో మూడు కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. పేరూరు కౌశిక వంతెన సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని రూ.2 కోట్ల నిధులతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సహకారంతో త్వరలోనే నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, స్థలదాత దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మంథా ఫణికుమార్, హెచ్ఎం ఎన్.విజయకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ పి.కరుణశ్రీ, అధ్యాపకులు డాక్టర్ ఎం.బాలాస్వామి, డాక్టర్ బి.ఆశిష్‌బాబు, పి.శేఖర్, తోట మురళీకృష్ణ, కరుణ, దుర్గాప్రసాద్, శివప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన సిద్ధివినాయక ఆలయం 7

లంక గ్రామాలకు ఏడాదిలో వంతెన పూర్తి

- రూ.23.30కోట్ల బిల్లులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆ నాలుగు లంక గ్రామాల దశాబ్దాల కాలం నాటి వంతెన కల త్వరలో నెరవేరబోతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం మండలంలో లంక గ్రామాల రాకపోకలకు వంతెనపనుల నిమిత్తం, భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులకు కూటమి ప్రభుత్వం బిల్లులు విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనసేన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గోదావరికి ఎర్రనీరు వచ్చిందంటే చాలు గంటి పెదపూడి శివారు బూరుగులంక, అరిగెలవారిపేట,పెదపూడిలంక,ఉడిమూడిశివారు ఉడిమూడిలంక గ్రామాలప్రజలు బూరుగులంక నదీపాయలో పడవలపై రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నార న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వంతెన నిర్మాణం, సాగుతున్న పనులు, బిల్లుల జాప్యం తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు.వంతెన నిర్మాణంతోపాటు 5.27ఎకరాల భూసేకరణ వెరసి రూ.49.50కోట్లు కాస్తా రూ.71.43కోట్లకు అంచనా వ్యయం పెరిగిందన్నారు. నెలరోజుల క్రితం అసెంబ్లీ ఎస్యూరెన్స్ కమిటీ సమావేశం జరిగిందని, దీనికి హాజరైన పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజకు వంతెన నిర్మాణానికి బిల్లుల మంజూరులో జాప్యం గురించి వివరించానని తెలిపారు.స్పందించిన ప్రభుత్వం వంతెనకు సంబంధించి రూ.21 కోట్లు, భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు రూ.2.30కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. వచ్చే వేసవినాటికి వంతెన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. వైసీపీ హయాంలో చల్లిగవ్వ కూడా విడుదల కాలేదని, కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో నిధులు విడుదలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు 15శాతం వరకు రాయితీ

- జిల్లా ప్రజా రవాణాధికారి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు 10 శాతం నుంచి 15 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి ఎన్టీపీ రాఘవకుమార్ తెలిపారు. ఇంద్ర సర్వీసులో ప్రయాణికులకు అమలాపురం నుంచి విజయవాడ, విశాఖపట్నానికి వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ కల్పిస్తామన్నారు. డిపో నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న ఏసీ బస్సులైన నైట్‌రైడర్ సర్వీసు ప్రయాణ చార్జీలు 15శాతం రాయితీ పొందవచ్చునన్నారు. అమలాపురం డిపో నుంచి రావులపాలెం మీదుగా శంషాబాద్‌కు నడుపుతున్న ఇంద్ర సర్వీసుకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 23వ తేదీ వరకు ఉంటుందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రాఘవకుమార్ కోరారు.

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు 7

హైదరాబాద్‌కు డీఆర్వో ఆధ్వర్యంలో బృందం



కలెక్టర్‌ను కలిసిన ఇమిగ్రెంట్ కేంద్ర కార్యాలయానికి వెళ్లే బృందం

అమలాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా నుంచి ఇతర దేశాలకు వెళ్లి స్థిరపడాలనుకునే వారి కష్టసుఖాలను స్వయంగా గుర్తించిన కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వలసదారుల కేంద్రం పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో, నోడల్ అధికారి కె.మాధవి నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లోని ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రెంట్ కేంద్ర కార్యాలయానికి పూర్తిస్థాయి అధ్యయనం నిమిత్తం బయలుదేరి వెళ్లినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. జిల్లా నుంచి ఉపాధి అవసరాల నిమిత్తం వివిధ దేశాల్లో స్థిరపడేందుకు వెళ్లినవారు ఏజెంట్ల మోసాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈ కేంద్రం ద్వారా గ్రహించారు. అక్కడ పడుతున్న ఇబ్బందులను పరిశీలించిన అధికారులు ఈ పర్యటన బృందంలో వెళ్లి కేంద్రం పనితీరును పరిశీలిస్తారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు వలసదారులకు అవగాహన కల్పించేందుకు ఈ అధ్యయన బృందం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.



ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా.. నగ్నంగా ఉన్న బాబా (ఫైల్)

హిందూ..ముస్లింల దేవుడు వలీబాబా

- మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న దర్గా
- నేటి నుంచి కొత్తలంకలో ఉరుసు ఉత్సవాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుల మత వైషమ్యాలకు అతీతంగా.. వర్గ విబేధాలకు దూరంగా అక్కడ హిందూ-ముస్లింలు ఒకే బాబాను ఆరాధిస్తారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా వద్ద ప్రతీ ఏటా ఇదే రీతిలో ఉరుసు ఉత్సవాలు జరుగుతాయి. మౌనమే భాష, సేవే ధ్యానం, పరోపకారమే జీవిత పరమార్థాలుగా సర్వం త్యజించి నగ్న శరీరం తో ఉండే బాబా దివ్య సందేశాన్ని భక్తులకు అందించేవారు.నైజాం నవాబుల కాలం 1868లో నల్గొండ జిల్లా కొల్లేపల్లి గ్రామంలో బాబా జన్మించినట్టు అక్కడ ఉన్న ఆధారాలను బట్టి తెలుస్తుంది. 1918లో మూసీ నదికి వరద వచ్చినప్పుడు ఖాదర్‌వలీ బాబా ముమ్మిడివరం సమీపంలోని కొత్తలంక గ్రామానికి తొలిసారిగా వచ్చినట్టు స్థానికులు చెబుతారు. నగ్న శరీరంతో ఉండే ఈ బాబా నీళ్ల మీద నడక, మంచులో పడుకోవడం, వర్షంలో ఉన్నా తడవకపోవడం వంటి మహిమలు చూపేవారని చెబుతారు. బాబా పట్ల తొలిసారిగా కొత్తలంక గ్రామానికి చెందిన గేదెల వెంకటరత్నం ఆకర్షితులయ్యారు. ఆయనే బాబాకు సపర్యలు చేస్తుండేవారు. వెంకటరత్నం కుటుంబీకులే నేటికీ బాబాకు పూజలు చేస్తున్నారు. 1948 జూలై 28న బాబా తన దేహాన్ని త్యజించారు. అక్కడ నిర్మించిన సమాధే బాబా దర్గాగా పేరొందింది. నాటి నుంచి ప్రతీ ఏటా సమాధి వద్ద ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హిందూ-ముస్లింలు తరలివస్తుంటారు. వెంకటరత్నం సోదరులు ఏడాదికి ఒకరి వంతున సమాధి వద్ద పూజలు నిర్వహిస్తూ ఉత్సవాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఉరుసు ఉత్సవాలు గురువా రం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం చందల్ (గంధం) మహోత్సవం, మధ్యాహ్నం తెప్పోత్సవం, అదే రోజు సాయంత్రం ఫకీర్ల మేళతాళాలు, నౌబత్‌ఖానా, వాయిద్యాలు, బ్యాండు మేళాలలతో పొన్నూరివారి గుర్రపు నాట్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహిస్తారు. 5వ తేదీ శుక్రవారం దీపారాధన, 6 శనివారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గేదెల రఘునాథ్‌బాబా, ముజావర్ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజన వసతి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులకు స్నానపు గదులు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఊరంతా.. మా..స్టార్లే!



పట్టుబట్టారు.. డీఎస్సీ సాధించారు

- శ్రీరంగపట్నంకు చెందిన 10 మంది ఎంపిక
- గ్రామంలో మొత్తంగా 25 మంది ఉపాధ్యాయులు



యల్లపు అన్నపూర్ణ



దాడి పార్వతి



గంగాభవాని



షణ్ముఖ కుమార్



రాపేటి శిల్ప



దాడి విజయ్



దాడి శివాజీ



బొడ్డేటి రఘురాం



కాళ్ళ శివరామకృష్ణ



ఎం.రాజు

(కోరుకొండ- ఆంధ్రజ్యోతి)

పల్లెటూరులో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే గొప్ప.. అటువంటిది ఒకే ఊరులో ఏకంగా పది మంది ఒకే తరహా ఉద్యోగం సాధిస్తే ఎలా ఉం టుంది.. ఆశ్చర్యమే కదూ.. అది కూడా అన్నీ మం చి ర్యాంకులే అయితే ఆ ఊరు పేరు మారుమ్రోగిపోతోంది.ప్రస్తుతం కోరుకొండ మండలం శ్రీరంగ పట్నం పేరు అలాగే మారుమ్రోగిపోతోంది. ప్రభు త్వం ఉమ్మడి జిల్లాకు సంబంధించి 1271 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 10 పోస్టుల్లో ఆ ఊరు వాళ్లే పాగా వసేశారు. ప్రభు త్వ పాఠశాలలో చదివినా పట్టుదలతో చదివి పది మంది మా..స్టార్లుగా మారిపోయారు. పది మం దికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామం కళలకు పుట్టిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లోను ఒక కళాకారుడు ఉంటాడు. అలాంటి గ్రామం నుంచి ఓ అరుదైన రికార్డు. ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఈ గ్రామం నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఎంపికై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు.వీరిలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. మరో ఐదుగురు ఒకటి, అర మార్కులతో ఉపాధ్యాయ పోస్టులకు దూరమయ్యారు. లేదంటే ఆ సంఖ్య 15 మందికి చేరేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో గ్రామానికి చెందిన దాడి పార్వతి 17వ ర్యాంకు సాధించింది.గణితంలో సిల్బర శెట్టి గంగాభవాని 16వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఎస్టీటీ బొడ్డేటి వీర వెంకట రఘురాం 24వ ర్యాంకు సాధించగా రాపాటి శిల్ప 35వ ర్యాంక్ సాధించా రు. ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి సుమారు 15 మంది ఉపాధ్యాయులుగా ఉన్నారు. అంటే మొత్తం ఆ గ్రామంలో 25 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఎస్సీలో 10 మంది ఎంపికవడం ఆనందంగా ఉంది..



మెగా డీఎస్సీకి ముందు శ్రీరంగపట్నం గ్రాడ్యుయేట్స్ అనే వాట్సప్‌ను క్రియేట్ చేశా.. దీని ద్వారా ఎప్పటికప్పుడు డీఎస్సీ మెటీరియల్, జీకే, నోటిఫికేషన్స్, విద్యా సంబంధ సమాచారం గ్రూపులో పోస్టు చేసి డీఎస్సీ రాసే వారిని ప్రోత్సహించేవాడిని.ఈ డీఎస్సీలో 10 మంది ఒకేసారి ఎంపికయ్యారు. మా గ్రామంలో 25 మంది మాస్టార్లు ఉండడం ఆనందంగా ఉంది. **- తనకాల వెంకటభగవాన్, ఉపాధ్యాయుడు, శ్రీరంగపట్నం**





చిత్రం.. భళారే!

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులా మజాకానా..ఒకసారి చూశారా పట్టేస్తారు.. చేతికి పనిచెప్పేస్తారు.. అచ్చుగుద్దినట్టు దింపేస్తారు..ఈ చిత్రంలో చూశారా..అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని చిత్రీకరించారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులతో ఏం చేయిద్దామా అని ఉపాధ్యా యుడు ఆలోచించాడు. చిన్నారుల చేతులకు పనికల్పించాలని ఒక ఆలోచన చేశారు. ఒకసారి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాన్ని చూపించి మీకు నచ్చిన వస్తువుపై అచ్చంగా ఈ ముఖం రావాలని చిత్రకళ ఉపాధ్యాయుడు డి. వెంకటేష్ సూచించారు. అంతే విద్యార్థినులు బి.నందిని, ఎస్.సత్యశ్రీ, సీహెచ్ . లావణ్య రంగంలోకి దిగారు. కోడిగుడ్డు పెంకు, ఆవాలు, రావిఆకులపై డా. రాధాకృష్ణన్ చిత్రాన్ని చిత్రీకరించారు.ఆ చిత్రాన్ని చూసిన హెచ్‌ఎం, ఉపాధ్యా య సిబ్బంది ఆశ్చర్యపోయారు. వెంటనే విద్యార్థినులను అభినందించారు.





అరగంటలో సమస్యను ఇలా పరిష్కరించారు..

అర గంటలో రోడ్డేశారు!

అధికారులు తలచుకుంటే ఏ పనైనా ఎంత సేపు.. సమస్య ఉందని అనుకోవాలే కానీ ఆగమేగాలపై చేసేస్తారు.. సమస్యను పరిష్కరించేస్తారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో జడ్జి బంగ్లా వద్ద ఒక రోడ్డు ప్రమాదకరంగా మారింది.. ఆ రోడ్డును గమనించకపోవడంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు.. ఈ విషయం అధికారులు గుర్తించారు.. వెంటనే సమస్యను పరిష్కరించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా అటు ట్రాఫిక్ పోలీసులు.. ఇటు మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది మంగళవారం ఆ పని దగ్గరుండి చేయించారు. కేవలం గంటలోనే రోడ్డును ఇలా సాఫీగా చేసేశారు.. ఇది గమనించిన ఆ ప్రాంతవాసులు ఆశ్చర్యపోయారు. అయ్యా అధికారులు పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై ఇదే విధంగా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.. **- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం**

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాజరాజేశ్వరికి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు



రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మం డలం శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల మండపేట మండలం ద్వారపూడి ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన బత్తిన రాజరాజేశ్వరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు దక్కింది. 2001లో సోషల్ టీచర్‌గా ఉపా ధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రాజరాజేశ్వరి ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం గా పనిచేశారు. అనంతరం 2019లో శాటిలైట్‌సిటీలో హెచ్‌ఎంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2021 జనవరి 26న అప్పటి ఉమ్మడిజిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి చేతుల మీదుగా బెస్ట్ పెర్ఫా ర్మెన్స్ అవార్డు అందుకున్నారు. 2021 ఆగస్టు 16న సీఎం జగన్ చేతుల మీదుగా నాడు నేడు ఫేజ్-1లో బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. 2024 సెప్టెంబరు 5న కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఇటీవల మండపేట మండలం ద్వారపూడి బదిలీపై వెళ్లారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని అమరావతిలో అవార్డు అందుకోనున్నారు. అవార్డురావడం తనకు మరింత బాధ్యత పెరిగిందని రాజరాజేశ్వరి తెలిపారు.

వినూత్నంగా మంగారాణి పాఠ్యాంశాల బోధన



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ లాలాచెరువు ఎంపీఎల్ పాఠశాల ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం లాలాచెరువు పాఠశాల ఎస్ఏ మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు కైవసం చేసుకోవడంపట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే మంగారాణి పాఠ్యాంశాలు బోధనలో వినూత్న పంథాలో వెళుతున్నారు. గతంలో బొమ్మలను తయారుచేసి వాటిని ఉదాహరణగా చూపిస్తూ పాఠశాలు చెప్పేవారు. అటుపై వీడియోల ద్వారా పాఠాలు అటుపై మంగారాణి యూట్యూబ్ పాఠశాల పేరుతో అద్భుతంగా బోధనలుచేసి ప్రశంసలు అందుకున్నారు. రెండువేల యూ ట్యూబ్ వీడియోలను తయారుచేసి మన్ననలు పొందారు. వీటన్నింటి నేపథ్యంలోనే ఈ అవార్డు లభించిందని మంగారాణి చెప్పారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుర్గాప్రసాద్



కొత్తపేట,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం అవిడి గ్రా మ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉ పాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డుకు ఎంపికయ్యారు ఈమేరకు ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. 40 సంవత్సరాలు వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు దుర్గాప్ర సాద్ తెలిపారు. ఈ అవార్డు రావడంపట్ల తోటి ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

కేపీపురం ఆంగ్ల ఉపాధ్యాయుడికి అవార్డు



బి.ప్రవీణ్ కుమార్

తొండంగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బొబ్బాది ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కించుకున్నారు. రామచంద్రపురంలో పుట్టిన ఆయన 2002 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో మొదటిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన యు.కొత్తపల్లి మండలంలోని పలు పాఠశాలల్లోను తొండంగి మండలం తలపంటి పేటలోను పనిచేశారు. 2023లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ప్రమోషన్ పొంది ప్రస్తుతం పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2023లో ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనకు అవార్డు రవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రాతి సత్యనారాయణ, ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి అభినందనలు తెలిపారు.

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం గాయత్రి...



సర్పవరంజంక్షన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెడ్మాస్టర్ కె.గాయత్రికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన 2025 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి గాయత్రిని ఎంపిక చేశారు. తొలిసారిగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అప్లికేషన్ చేయకుం డా, ప్రభుత్వం లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభా పాటవాలను గుర్తించి ఈఅవార్డుకు ఎంపిక చేసింది. 30ఏళ్లుగా అనేక స్థాయిల్లో విద్యార్థులను ఉత్తమ విజేతలుగా తయారు చేయడం, పాఠశాల అభివృద్ధి పథంలో నడపటం వంటి కారణాలతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రభావతి



అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లిలంక గంటి మోహన్‌చంద్రబాలయోగి జిల్లాపరిషత్ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈమేరకు ఆమెకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రభావతి 2001 డీఎస్సీ ద్వారా ఎంపిక చే సిన 2002 జనవరి 21న రావులపాలెం మండలంలోని ఈతకోట జిల్లాపరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విధులు ప్రారంభించారు. సఖినేటిపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల ఏపీ ఎస్సీసీ స్టేట్ మోనటరింగ్ ఆఫీసర్‌గా కూడా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ప్రభావతిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.

తెలుగు అధ్యాపకుడు వీరరాఘవరావు..



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న నక్కిన వీరరాఘవరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగుభాషపై ఉన్న మక్కువతో ఆయన విద్యాభ్యాసంలోనే కాకుండా అనేక అవార్డులు, రివార్డులు సాధించారు. 16సంవత్సరాలుగా అధ్యాపకుడిగా ఎందరినో తీర్చిదిద్దిన ఆయన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సా ధిం చారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, పాఠ్య పుస్తక రచయితగా, రాష్ట్ర విద్యాబోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా ఆయన పనిచేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వీరరాఘవరావును అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ(బుజ్జి), వైస్ ఎంపీపీ పులగం బులిరెడ్డి, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి అభినందించారు.

7వ తేదీన భీమేశ్వరాలయం మూసివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఈనెల 7న సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని మూసివేయనున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ తెలిపారు. 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నివేదన అనంతరం ఆలయం మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ,పూజాధికాలు అనంతరం ఉయదం 7.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతి ఇస్తామని తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

ఘనంగా గణపతి హోమం

ద్రాక్షారామ బీమేశ్వరాలయంలో దుండి గణపతి సన్నిధిలో బుధవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం ఆలయ అర్చకులు, వేదపండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారులు శాస్త్రోక్తంగా చేశారు. ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి

- 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది.

పర్యవేక్షణ ఏదీ?

- ఎన్‌హెచ్ పనుల్లో అధికారుల తీరుపై మంత్రి జనార్దనరెడ్డి అసంతృప్తి



దివాన్‌చెరువు వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అభివృద్ధి పనులు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులో టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) పద్ధతిలో ఓ ప్రైవేట్ సంస్థ చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యవేక్షణలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. రహదారి అభివృద్ధిలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను మంత్రి స్వయంగా చూశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీపడవద్దన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గడువు మేరకు వేగవంతంగా పనులు పూర్తిచేయాలని, పటిష్ట రోడ్ల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు.

సత్యదేవుడి భక్తులకు రక్షణగా రూ 2.50 కోట్లతో షెడ్డు నిర్మాణం

- భూమిపూజ చేసిన దాత లారెస్ కంపెనీ ఎండీ కృష్ణంరాజు



పశ్చిమ రాజగోపురం వద్ద షెడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దాత కృష్ణంరాజు

అన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దర్శనానికి వచ్చే భక్తులకు పశ్చిమ రాజగోపురం వద్ద ఎండా, వానల నుంచి రక్షణగా టెన్‌షెట్ షెడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. విశాఖపట్నంనకు చెందిన లారెస్ కంపెనీ అధినేత కృష్ణంరాజు దీనిని నిర్మిస్తున్నారు. దీని నిర్మాణంకోసం 2023లో అప్పటి ఈవో ఆజాద్ రూపకల్పనచేసి 30 వీఐపీ సత్రాన్ని తొలగించారు. కొన్ని సాంకేతిక కారణాలతో నిర్మాణం వాయిదా పడడంతో ఖాళీప్రదేశంగా దానిని ఉంచేశారు. తిరిగి ప్రస్తుత ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు మరోసారి దాతను సంప్రదించి అడ్డంకులను తొలగించారు. 120 అడుగులు పొడవు, 80 అడుగులు వెడల్పుతో దీనిని నిర్మిస్తుండగా సుమారు రూ. 2.50 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ భూమిపూజలో దాత దంపతులతో పాటుగా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ఈఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక బలవన్మరణం

● పురుగుల మందు తాగి రెండేళ్ల కుమారుడుకి పట్టించిన తల్లి
● కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. అతడు లేని జీవితాన్ని ఊహించలేకపోయింది. రెండేళ్ల కుమారుడ్ని ఏ విధంగా పెంచి పెద్ద చేయాలో ఎంతో ఆలోచించింది.. చివరకు జీవితంపై విరక్తితో పురుగుల మందు కలిపిన సోడా తాగి తర్వాత కుమారుడితో తాగించి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన తల్లి, కుమారుడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఇద్దరు మృతిచెందారు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా సర్పవరం శివారు గాంధీకాలనీలో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురం గాంధీకాలనీకి చెందిన జనపల్లి గోపి, ఆకాంక్ష (25) భార్యాభర్తలు. వారికి రెండేళ్ల కుమారుడు సార్విక్ ఉన్నాడు. భర్త మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసేవాడు. కుమారుడి పుట్టిన రోజు వేడుక కోసం రూ.3 లక్షల అప్పులు చేశాడు. అవి తీర్చలేక, ఒత్తిడి తట్టుకోలేక జూలై 22న పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. భర్త చనిపోయిన దగ్గర నుంచి ఆకాంక్ష రోధిస్తూ తమ భవిష్యత్తుపై కలత చెంది మానసికంగా కుంగిపోయింది. అత్త, పుట్టింట్లో తలో పది రోజులు ఉండేది. ఇటీవలే పుట్టింటి నుంచి అత్తమామలు నివాసం ఉండే గాంధీ కాలనీకి వచ్చింది. భర్తను తలచుకుంటూ జీవితంపై విరక్తితో గతనెల 31న మధ్యాహ్నం 3 గంటల సమయంలో సోడాలో పురుగుల మందు కలిపి ముందు తాను తాగిన తర్వాత కుమారుడికి పట్టించింది. ఇద్దరూ తీవ్ర అస్వస్థతకు గురైపడి ఉండటాన్ని గమనించిన అత్తమామలు వెంటనే చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతోన్న తల్లి, కుమారురుడు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతు రాలి తల్లి దోనం శాంతికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మృతదేహాలకు పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిం చినట్లు తెలిపారు. కుమారుడు, కోడలు, మనవ డు సుమారు 45 రోజుల వ్యవధిలో మరణిం చడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


భర్త గోపితో భార్య ఆకాంక్ష, కుమారుడు (ఫైల్ ఫొటో)

తల్లిదండ్రులు మందలించారని బాలిక ఆత్మహత్య

శంఖవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అన్నవరం అదనపు ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కనిగిరి వరలక్ష్మీ అపర్ణ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ చదువుతుంది. అయితే మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఉరివేసుకుంది. బుధవారం అదనపు ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేశారు.

దివ్యాంగ బాలికపై వృద్ధుడి అత్యాచారం

మామిడికుదురు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల దివ్యాంగ బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్ల పైబడిన వృద్ధుడు అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు పరువు పోతుందన్న కారణంతో ఈ విషయాన్ని రహస్యంగా ఉంచారు. బాలిక గర్భం దాల్చడంతో గర్భస్రావం చేయించారు. ఈ సంఘటన 3 రోజులు క్రితం గ్రామంలో ఆ నోటా ఈ నోటా గుప్పుమనడంతో గ్రామ పెద్దలు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామంలోని పెద్దలు సమావేశమై బాధిత బాలిక కుటుంబ సభ్యులకు రూ.లక్షల్లో డబ్బు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని గ్రామంలో చర్చించుకుంటున్నారు. దీనిపై తమకు ఏ ఫిర్యాదు అందలేదని నగరం పోలీసులు తెలిపారు.

చేబ్రోలులో డెంగ్యూ జాడలు

పెరుగుతున్న జ్వర బాధితులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డెంగ్యూ జాడలు కనిపిస్తున్నాయి. గ్రామంలో పలువురు వైరల్ ఫీవర్లతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ పరిస్థితి ఉండగా, 2రోజులుగా మరింత తీవ్రమైంది. ఈబీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలుడికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. బాలుడికి సాధారణ జ్వరమేనని వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసేన నాయకులు సందర్శించి జ్వర పీడితులకు అందుతున్న వైద్యసేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రతన్‌తో మాట్లాడారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

మందులు తీసుకురమ్మని డబ్బిస్తే మద్యం తాగడంతో ఘాతుకం

కరప, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. మందులు తీసుకురమ్మని డబ్బిస్తే వాటితో పూటుగా మద్యం తాగి రావడంతో కోపోద్రిక్తుడైన కొడుకు తండ్రిని గొడ్డలితో విచక్షణారహితంగా నరికి హతమార్చాడు. కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ హత్యోదంతానికి సంబంధించి స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పలంక శివారు మొండి గ్రామంలో నివాసముంటున్న కాలాడి సూర్యచంద్రరావు(50)కు నలుగురు కుమారులున్నారు. అతడి భార్య క్యాన్సర్‌తో బాధపడుతూ మూడేళ్ల క్రితం చనిపోయింది. సూర్యచంద్రరావు సముద్రంలో వేటకు వెళుతూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. సూర్యచంద్రరావు మూడో కుమారుడు మహేష్ ఫిట్స్ వ్యాధి, మానసిక రుగ్మతతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. సోదరుడికి మందులు తీసుకురమ్మని రెండో కుమారుడు చంద్రశేఖర్ తండ్రికి రూ.500 ఇచ్చి పంపించాడు. అయితే ఆ డబ్బులతో పూటుగా మద్యం తాగి వచ్చిన తండ్రి తో కొడుకు చంద్రశేఖర్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో పట్టలేని కోపంతో తండ్రిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. తండ్రి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కరప ఎస్ఐ తోట సునీత సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ కేసు నమోదు చేశారు.


సూర్యచంద్రరావు మృతదేహం

రైతులను ఆదుకోని ప్రభుత్వం

వారికి మద్దతుగా వైసీపీ ఉద్యమం : శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స

కాకినాడ, సెప్టెంబరు 3, (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారికి యూరియా కూడా సరిగా అందజేయలేకపోతోందని, రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వైసీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కాకినాడలోని వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇబ్బంది పడేది రైతేనని, కూటమి ప్రభుత్వంలో అన్నదాతల పరిస్థితి చాలా దారుణంగా తయారైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్పా, చేతల్లో ఎక్కడా కనిపించడంలేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అయితే అనావృష్టి, లేకుంటే అతివృష్టి అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారన్నారు. వారికి మద్దతుగా ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపి, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని, ఎంతోమంది ప్రాణత్యాగాల ప్రతిఫలమని, దీని కోసం పెద్ద ఎత్తున వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు అన్ని నియోజకవర్గాల ప్రజామద్దతు నిరసన ఉద్యమం చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. గత నెల 30న కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు విశాఖలో ఉన్నా కనీసం విశాఖ ఉక్కుపై నోరెత్తలేదన్నారు. ఎన్నికల ముందు 21 మంది ఎంపీలు ఉన్నారు.. మీరు ఉప్పుకారం తింటున్నారా లేదా? అంటూ తెగ ఊగిపోతూ వైసీపీని విమర్శించిన పవన్‌కల్యాణ్ నేడు అధికారంలో ఉండి ఏం చేస్తున్నారని బొత్స ప్రశ్నించారు. నాటి పౌరుషం ఏమైందని, ఉప్పు కారం మీరు తినడం మానేశారా? అంటూ పవన్‌పై ధ్వజమెత్తారు. దీనిపై మీ కార్యాచరణ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కుపై అక్కడి పెద్దలపై ఏం మాట్లాడారో వెల్లడించాలని బొత్స పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.రెండు లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చిందని, అది నిజమో! కాదో! చెప్పాలని డిమాండ్ చేశారు. సుగాలి ప్రీతి హత్య కేసుపై తమ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి, సీబీఐకి అప్పగించిందన్నారు. ఇలాంటి విషయంలో మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం చంద్రబాబు అన్నట్టుగానే అసెంబ్లీలో తేల్చుకుంటామని ఆయన వెల్లడించారు. అధికార పక్షం నుంచి కూటమి, ప్రతిపక్షంగా వైసీపీ రెండు తేల్చుకుందాం రండి అని పిలుపునిచ్చారు.


కాకినాడలో మాట్లాడుతున్న బొత్స

జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ఇనిషియేటివ్‌ను అమలుచేసేందుకు వీసీ సమావేశ హాల్లో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ఏకృష్ణమోహన్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ సమక్షంలో జేఎన్టీయూకే, నాస్కామ్ అధికారులు సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వృత్తి నైపుణ్యాలు, హ్యాకథాన్లు, పరిశ్రమ నాయకత్వ సెషన్లలో కోర్సులను ఉచితంగా అందిస్తారన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈఎంవోయూ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాస్కామ్ ప్రతినిధులు ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌కుమార్ రెక్టార్, ఓఎస్డీ, పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


వీసీ ప్రసాద్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

చీటీల పేరుతో రూ.2.39 కోట్లు మోసం

పిఠాపురంలో ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో ఖాతాదారులను కోట్లల్లో మోసం చేసిన ఇద్దరు నిందితులను పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో 2014లో సత్యశివానీ చిట్‌ఫండ్ కంపెనీని కొర్రా సత్యనారాయణ, పక్కుర్తి వరహాలరావు, లోకారెడ్డి భాస్కరరావులను డైరెక్టర్లుగా ప్రారంభించారు. రూ.5 లక్షలు నుంచి రూ.20లక్షల వరకూ చీటీలు వేశారు. 2023లో చీటీలు పాడుకున్న ఖాతాదారులకు సొమ్ములు చెల్లించకపోవడంతో సుమారు 94మంది అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ అనంతరం ఖాతాదారులను మోసం చేసినట్లు వెల్లడి కావడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సునంత పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యశివానీ చిట్‌ఫండ్స్ రికార్డులు, ఖాతాదారులు వివరాలు, ఇతర ఆధారాలను పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. 94మంది ఖాతాదారులకు సంబంధించి రూ.2.39 కోట్లను చెల్లించకుండా చిట్‌ఫండ్ కంపెనీ డైరెక్టర్లు పక్కదోవపట్టించి సొంత అవసరాలకు వినియోగించినట్టు విచారణలో వెల్లడైంది. విచారణ అనంతరం కంపెనీ డైరెక్టర్లు పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణరావు, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన లోకారెడ్డి భాస్కరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో మరికొందర్ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న ఉదయం 8గంటలకు ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన, పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా 2025 నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ తెలిపారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్ స్టాఫ్ వచ్చి అప్రెం టిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టిసి సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు ఒరిజినల్స్‌తో హాజరుకావాలని, 9440408182లో సంప్రదించాలని కోరారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా స్మరణ్ రాజ్

● ప్రస్తుత పీవోకి పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం



రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన పీవోగా 2022 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత పీవో కట్టా సింహాచలానికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఈయన తెలుగువాడు కావడం విశేషం. తెలంగాణలోని సిద్దిపేట జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్ విద్యానగర్‌లో ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించారు. తండ్రి రమేష్ కుమార్ హైదరాబాద్‌లో న్యాయవాది వృత్తిలో ఉన్నారు. 2021లో సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 676వ ర్యాంకు సాధించి 2022 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. తొలుత అనకాపల్లి అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. అనంతరం మార్కాపురం, నూజివీడు సబ్ కలెక్టరుగా పనిచేశారు. నూజివీడు నుంచి ఇటీవలే బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. స్మరణ్ రాజ్ ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు. 2017లో బ్రెయిన్ హెమరేజ్ సమస్యతో బాధపడిన తర్వాత రికవరీ అయ్యి ఐఏఎస్ సాధించారు.

లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్ వ్యాన్

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు ● దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో ఘటన
● బాధితులంతా శ్రీకాకుళం వాసులే .. పోలీసు కేసు నమోదు

దేవరపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన జీరు అసిరినాయుడు, లక్ష్మీదంపతుల కుమారుడు లక్ష్మణరావు (నాని) 28 సంవత్సరాలు నెల్లూరులో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈవెంట్ కోసం తన డ్యాన్స్ బృందం 11 మందితో కలిసి టాటామ్యాజిక్ వ్యాన్‌లో బయల్దేరాడు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీని మ్యాజిక్ వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో డ్యాన్స్ మాస్టర్ లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. 10 ఏళ్ల నుంచి లక్ష్మణరావు ఎంఎండీఎస్ పేరుతో డ్యాన్స్ బృందాన్ని నడుపుతున్నాడు. స్వల్ప గాయాలైన శ్రావణ్, ఖరీష్మ, హరిను హుటాహుటిన 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, మృతదేహాన్ని గోపాలపురం ఆరోగ్యకేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



మృతుడు జీరు లక్ష్మణరావు (ఫైల్)
ప్రమాదానికి గురైన టాటామ్యాజిక్ వ్యాన్

తెలికిచర్లలో అశ్లీల నృత్యాలు

● ఆలస్యంగా వెలుగులోకి ● తమ దృష్టికి రాలేదన్న సీఐ బాలశౌరి

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం తెలికిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా జరిగిన ఊరేగింపులో మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్ వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌పై మహిళలు అశ్లీలంగా వేసిన నృత్యాలను కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో బంధిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది. తెలికిచర్ల, కొత్తపేటలో రెండు చోట్లా రికార్డింగ్ డ్యాన్స్ జరగడంతో మండలంలో సంచలనమయ్యింది. మొన్న ఘంటవారిగూడెంలో జరిగిన సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నల్లజర్ల సీఐ బాలశౌరిని వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రికార్డింగ్ డ్యాన్స్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్వామి,అమ్మవార్లు


పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో మూడో రోజు బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై కొలువుదీర్చి అలంకరించారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో పంచసూక్తాలతో వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. సర్వ దైవత్య హోమం, మహాశాంతి హోమం, పంచ సూక్తాలతో హోమం, మూల హోమం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర నామార్చన మొదలగు విశేష పూజలుచేశారు. పవిత్రోత్సవాల్లో ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమసిన వివాదం

● గిరిజన విద్యార్థి మృతి కేసులో కలెక్టర్ జోక్యం
● మృతుని కుటుంబానికి పరిహారం, ఉద్యోగ కల్పన హామీతో ఆందోళన విరమణ

రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానందరెడ్డి మృతిలో గత మూడురోజులుగా ఐటీడీఏ అధికారుల తీరుపై కుటుంబసభ్యులు చేపట్టిన ఆందోళన బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ జోక్యంతో విరమించారు. విద్యార్థి మృతిపై చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం నుంచి బంధువులు, ఆదివాసీ నాయకులు కలిసి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా పెద్ద దిక్కుగా ఉన్న ఐటీడీఏ పీవో వచ్చి న్యాయం చేస్తామని చెప్పి భరోసా కల్పించాలని బాధితులు కోరగా, ఆయన రాకపోవడంతో గొడవ ఉధృతమైంది. ఫలితంగా మూడురోజులుగా విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం జరగలేదు. ఎట్టకేలకు కలెక్టర్ రంగంలోకి దిగి ఐటీడీఏ, గిరిజన సంక్షేమ అధికారులకు ఆదేశాలిచ్చి, మృతుడి కుటుంబానికి ఉద్యోగ కల్పనపై అధికారులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది లిఖిత పూర్వక హామీతో పాటు రూ.1.50 లక్షల తక్షణ పరిహారం అందజేయడంతో ఆందోళనను విరమించారు. అలాగే ఐటీడీఏ తరఫున గిరిజన సంక్షేమ డీడీ రుక్మాంగదయ్య ఆందోళనకారులతో చర్చించారు. దీంతో కలెక్టర్‌కు మృతుడి కుటుంబీకులు గిరిజన నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. మూడోరోజు ఆందోళనలో నాయకులు మట్ల వాణిశ్రీ, పల్లాల అనసూయ, సాదల చిలకమ్మ, బాలు అక్కిన, మద్దేటి అంజిరెడ్డి, కత్రం రామదాసు దొర, గొర్లె ప్రణీత్, ఐవీ రమణ, ఈక నరసన్నదొర పాల్గొన్నారు.



రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుమిగూడి ఉన్న ఆందోళనకారులు

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి

● ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భాద్రపద ఏకాదశి, వినాయక ఉత్సవాలు సందర్భంగా బుధవారం అయినవిల్లిలో సిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష దూర్వార్చన, మాడవీధిసేవ, ప్రత్యేకాలంకరణ చేశారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. బుధవారం పంచామృతాభిషేకాలు 6, లఘున్యాస అభిషేకాలు 260, ప్రత్యేక దర్శనం 804, శ్రీలక్ష్మీగణపతి హోమం 58, నామకరణం 1, అక్షరాభ్యాసాలు 8, తులాభారం 15, ద్విచక్ర వాహన పూజలు 24, కొబ్బరికాయల మొక్కుబడి 20, పులిహోర 3481, లడ్డూ 4420, అన్నప్రసాదం 5,900, అన్నప్రసాద విరాళం రూ.2,46,046, విరాళాల ద్వారా రూ. 2,591, మొత్తం ఆదాయం రూ. 5,57,853 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవాని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు



ట్రాక్టర్ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

అమలాపురం రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కామనగరువు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతిచెందినట్టు అమలాపురం పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో భట్నవిల్లి వైపు నుంచి అమలాపురం వైపు ట్రాక్టరు, మోటారు సైకిల్ ఒకే మార్గంలో వెళుతున్నాయి. అయితే ట్రాక్టర్ వెనుకభాగం మోటారు సైక్లిస్టుకు తగలడంతో భట్నవిల్లికి చెందిన వడ్రంగి మేస్త్రి గోడ ఫణికుమార్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అమలాపురం

అప్పనపల్లి కాజ్‌వేను వీడని వరద

మామిడికుదురు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి):గోదావరికి వరద తీవ్ర తగ్గినప్పటికీ అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికుల ఇబ్బందులతోప్రయాణాలు చేస్తున్నారు. కాజ్‌వేపై 2అడుగుల మేర వరదనీరు ప్రవహిస్తుండడంతో పెదపట్నంలంక, బి.దొడ్డవరం,అప్పనపల్లిగ్రామాల ప్రజలు వరదనీటిలోరాకపోకలు సాగిస్తున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇప్పటికీ లంక గ్రామాలు వరద ముంపు నుంచి తేరుకోలేదు. అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, కొత్తలంక, లాకోపేట్, సఖినేటిపల్లి లంక గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకువచ్చింది.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన దేవగుప్తం వాసులు

అల్లవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 30గంటలు దాటినా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆగ్రహంతో దేవగుప్తం పెదాంధ్ర పేట వాసులు బుధవారం రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. అంధకారంలో మగ్గుతున్నా విద్యుత్ శాఖ ఏడీఈ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహించినవారు నిరసన వ్యక్తం చేపట్టారు. విద్యుత్ ఏడీఈ నిర్లక్ష్య వైఖరి నశించాలి, అంధకారంలో పెదాంధ్ర పేట అంటూ నినాదాలు చేశారు. గెద్దం రాంప్రసాద్, జాలెం రమణ, గెద్దం వెంకన్న, బళ్ల రాజ్‌కుమార్, చోడే వీరేష్, విప్పర్తి శ్రీను, బండి మురళీ, జల్లి లోవప్రసాద్, గెద్దం ఏడుకొండలు, తదితరులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. దళిత పేటల పట్ల విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అధికారులపై చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈఆందోళనతో దిగివచ్చిన విద్యుత్‌శాఖ అధికారులు హుటాహుటిన ఆ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



అల్లవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన పెదాంధ్రపేట వాసులు

వివాదాస్పద ఫ్లెక్సీలు తొలగించాలని ఆందోళన



వివాదాస్పద ఫ్లెక్సీలు తొలగించాలంటూ ఎస్ఐకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

మామిడికుదురు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వివాదాస్పదంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు తొలగించాలంటూ దళిత సంఘాల నాయకులు బుధవారం నగరం పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అప్పనపల్లిలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన వివాదాస్పద ఫ్లెక్సీ నేపథ్యంలో ఈఆందోళన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల కులసంఘాలు, సినీ హీరోలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఫ్లెక్సీల్లో కల్యాణ్‌సీమ, బాబు సీమ అని అంటూ హీరోల పేర్లతో జిల్లాకు అన్వయించడం వివాదాలకు కారణం అవుతుందన్నారు. ఆయా వ్యాఖ్యలు కొన్నికులాల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయని, ఆ తరహా ఫ్లెక్సీలను ఏర్పాటుచేస్తున్న, ప్రింటింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నగరం ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ తహశీల్దార్ సునీల్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో నిరుపేదల దత్తత, సంక్షేమం, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కోడూరుపాడు సత్యకస్తూరి కల్యాణ మండపంలో జరిగిన నిరుపేదల సంక్షేమం, పీ-4 సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నందున అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.రాంబాబు, ఎంపీడీవో బి.లక్ష్మణరావు, తహశీల్దార్ వీవీఎల్ నరసింహరావు, గుబ్బల రామ్‌ప్రసాద్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ కార్యదర్శి పచ్చిమాల ఏడుకొండలు, సహకార సొసైటీల అధ్యక్షులు కంకిపాటి గోపి, వేగిరాజు వెంకట్రాజు, కంకిపాటి వీరబాబు, మంతెన సురేష్‌రాజు, నల్లా రాము, సుంకర సాయి, రాసూరి రాంబాబు, నార్గన శ్రీనివాస్, సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ ఎన్.మౌనిక పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవ కమిటీల ప్రతినిధుల సమావేశం

అమలాపురంటౌన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే విజయదశమి ఉత్సవాల నిర్వహణపై ప్రధాన ఉత్సవ కమిటీల సమావేశం బుధవారం అమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించారు. ప్రధానంగా ఏడు వీధుల నుంచి జరిగే ఊరేగింపు కమిటీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. దసరా ఊరేగింపు అక్టోబరు2న నిర్వహించేందుకు కమిటీల ప్రతినిధులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. కొంకాపల్లి, మహిపాలవీధి, గండువీధి, రవణంమల్లయ్యవీధి, రవణంవీధి, నల్లావీధి, శ్రీరామపురం కమిటీలకు సంబంధించిన ప్రతినిధులు పనసా బుజ్జి, అబ్బిరెడ్డి సురేష్, తిక్కిరెడ్డి నేతాజీ,చిక్కాల రాంబాబు, ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాము, గోకరకొండ బాల, రవణం చిట్టి, రవణం నరసింహారావు, రాయుడు సత్యరుణి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీల ప్రతినిధులు

అలంకరణ

అంబాజీపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాచవరం కోఠివారి అగ్రహారంలో వరసిద్ధి వినాయకుడిని విభూదితో అలంకరించారు.



బయోచార్ ఎరువును వినియోగించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భూమిలో కరిగే సేంద్రియ ఎరువు బయోచార్‌ను వినియోగించుకోవాలని కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ అన్నారు. అంబాజీపేటలో కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కంపెనీ ద్వారా అందిస్తున్న సేవలను వారు వివరించారు. సూక్ష్మ, సూక్ష్మ పరిశ్రమల నిర్వహణ శాఖ (ఎంఎస్ఎంఈ) ద్వారా కంపెనీకి విడుదలైన గ్రాంట్ రూ.3.19కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఇటీవల సొసైటీ చైర్మన్లగా నియమితులైన అరిగెల సూరిబాబు, సుంకర గణపతిరావు, యాళ్ల ఆనందరామయ్యలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ముత్యాల జమీలు, గోదాశి నాగేశ్వరరావు, మాకినిరెడ్డి పూర్ణిమ, వాకపల్లి దొరబాబు, యేడిద నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐడీఎల్ డైరెక్టర్‌గా భారతి



అంబాజీపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐడీఎల్) డైరెక్టరుగా మొసలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకురాలు మట్టపర్తి బాలభారతి నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు అందాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభాకరరావు



యానాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యానాం పీఎం శ్రీరాజీవ్‌గాంధీ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో గ్రేడ్-1 హెచ్ఎం పనిచేస్తోన్న కమిడి ప్రభాకరరావు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల5న పుదుచ్చేరిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో పుదుచ్చేరి గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి నుంచి ఆయన అవార్డును అందుకుంటారు.

పీ4లో సంపన్నులు భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 బృహత్తర కార్యక్రమంలో సంపన్నులంతా భాగస్వాములు కావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన విద్య, వైద్యం, న్యాయ సహాయం అందించి ఆ కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో పీ4 కార్యక్రమంపై మార్గదర్శకాలను వివరించేందుకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. మార్గదర్శకాలను ఆయన వివరించి మార్గదర్శకులుగా నిలిచిన జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ కె.శ్రీమన్నారాయణలను సత్కరించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి దుండి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, ఎంపీడీవో డీవీఎల్ఎన్ మూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, తిక్కిరెడ్డి నేతాజీ, చొల్లంగి సత్యసాయిబాబా, పొలమూరి ధర్మపాల్, యేడిద శ్రీను, ఆశెట్టి ఆదిబాబు, బాస్కర్ల రామకృష్ణ, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, పెనుమాల సునీత తదితరులు పాల్గొన్నారు.



బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న ఆర్డీవో శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీమన్నారాయణలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం



పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్ఎన్‌పీవో నూతన కార్యవర్గ సభ్యులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగుల సమస్యల కోసం ఎఫ్ఎన్‌టీవో యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని అమలాపురం డివిజన్ కార్యదర్శి మాలే ఏకాంబరం పేర్కొన్నారు. అమలాపురం పోస్టల్ డివిజన్ ఎఫ్ఎన్‌టీవో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా ఏకాంబరం, అధ్యక్షునిగా కె.ఆచార్యులు, నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టుమెన్ అండ్ ఎంటీఎస్ కార్యదర్శిగా జి.సతీష్, అధ్యక్షుడిగా బి.వెంకటరత్నం, గ్రామీణ్ నేషనల్ యూనియన్ ఆఫ్ డాక్ సేవక్ కార్యదర్శిగా వీవీ మహాలక్ష్మి, అధ్యక్షుడిగా భీమార్జునరావులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రతినిధుల బృందం బుధవారం పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్‌ను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. పోస్టల్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందిస్తున్న సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పడ్డ కొత్తపేట సబ్‌డివిజన్ నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ్ డాక్ సేవక్ కొత్త బ్రాంచి ఏర్పాటుపై సూపరింటెండెంట్ హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యదర్శిగా ఎంపికైన నీరజకు అభినందనలు తెలిపారు.

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఆర్వో

• సూపరింటెండెంట్‌తో సహా నలుగురు ప్రధాన వైద్యులు గైర్హాజరు



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఆర్వో మాధవి

అమలాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు ముగ్గురు ప్రధాన వైద్యులు విధులకు గైర్హాజరైనట్టు గుర్తించినట్టు డీఆర్వో కె.మాధవి తెలిపారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం మాధవి ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది విధులకు గైర్హాజరవడాన్ని గమనించారు. విధులకు గైర్హాజరైన వైద్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మాధవి తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి బుధవారం విధులకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ఆయన గైర్హాజరయ్యారు. అదేవిధంగా మరో ముగ్గురు వైద్యులు కూడా గైర్హాజరైనట్టు గుర్తించారు. ఆసుపత్రి ప్రాంగణాలను పరిశీలించి పారిశుధ్య నిర్వహణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాల్సిన వైద్యులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఉచిత వైద్య పరీక్షలు, మందుల సరఫరా, శుభ్రత, ఎమర్జెన్సీ వార్డులో పరిస్థితులపై అధ్యయనంచేసి రోగులు, వారి బంధువులతో ఆమె మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. తక్షణమే ఫిర్యాదు బాక్సును ఏర్పాటు చేయాల్సిందిగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అనూషను డీఆర్వో ఆదేశించారు. గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. ఏరియా ఆసుపత్రి తనిఖీకి సంబంధించిన పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని డీఆర్వో తెలిపారు.

సరస్వతీ పూజ

ముమ్మిడివరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీబాలాజీ కాన్వెంట్ హైస్కూలులో బుధవారం సరస్వతీదేవి పూజ ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని సన్నిధిలో విద్య, బుద్ధి, మేధస్సు అభివృద్ధి కోసం సరస్వతీ పూజలు జరిపించారు.పాఠశాల వ్యవస్థాపకుడు పీవీఎస్ శాస్త్రి, కరస్పాండెంట్ పి.సుజాత, ప్రధానోపాధ్యాయుడు రామరాజు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యుల సమావేశం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి జంపన సుబ్బరాజు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సమావేశం చైర్మన్ ఆకేటి పెద్ద అధ్యక్షతన బుధవారం జరిగింది. సహకార సంఘ కార్యకలాపాలు కంప్యూటరైజేషన్ అనంతరం జరిగిన తొలి సమావేశంలో సభ్యులు పలు ప్రశ్నలను సంధించారు. కంప్యూటరైజేషన్‌లో సభ్యుల ఖాతాలు ఆన్‌లైన్‌లో ఉంచిన విధానాన్ని డీసీసీబీ సూపర్‌వైజర్ నరేష్ వివరించి, సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఈవో పోలిశెట్టి దుర్గాప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రేపు గంగారావు మాస్టారు విగ్రహావిష్కరణ

రాజోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల అభివృద్ధికి నిరంతర కృషిచేసిన గుబ్బల గంగారావు మాష్టారు విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు చింతలపల్లిలో మాష్టారు గృహ ప్రాంగణంలో జరుగుతుంది. డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు విగ్రహావిష్కరణ చేస్తారని పూర్వపు విద్యార్థులు, అభిమానులు బుధవారం తెలిపారు. కొత్తపేటలో శిల్పి ఆచార్య డాక్టర్ డి.రాజ్‌కుమార్ వడయార్ విగ్రహ శిల్పి అని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



ఎమ్మెల్యే గొల్లపల్లిని సత్కరిస్తున్న కాంట్రాక్టర్ రఘురామ్

యానాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మెట్టకుర్రులోని ప్రభుత్వ పాఠశాలలో రూ.59లక్షలతో చేపట్టే క్రీడాభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఈఈ కాళ్ళ నాగరాజు భూమి పూజ చేశారు. 30అడుగుల వరకు ఐరన్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, క్రీడాకారులకు డ్రెసింగ్‌రూమ్స్, నెట్ ప్రాక్టీస్ పిచ్ తదితర పనులు చేపడతారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఎస్.రఘురామ్, ప్రజాపనులశాఖ అధికారులు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు అభినందన

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ క్రీడాకారుడు అత్యధిక పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. గారపాటి చంద్రశేఖర్ అధ్యక్షతన క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో ఎంచుకున్న క్రీడల్లో శిక్షణ పొందుతూ ముందుకు సాగాలన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు ఉండాలని సూచించారు. స్ట్రాంగ్ మాస్టర్లగా నిలిచిన బి.అప్పన్న, వై.ఇందిరలతో పాటు వివిధ విభాగాల్లో స్వర్ణ, కాంస్య, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లు, షీల్డులు అందజేశారు. జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి సముద్రం, ముమ్మిడి ప్రతాప్‌కుమార్, యెరుబండి చంటి, మారే వీరేంద్ర, వాకపల్లి దొరబాబు, నక్కా సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

పితృదేవతా పూజా మహోత్సవాలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షోడశరాత్రి పితృదేవతా పూజా మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అమలాపురం పోలీసు పెరేడ్ గ్రౌండ్ ఎదురుగా కాక ధ్వజాన్ని ఎగురవేశారు. చతుర్ధశ్యాంతి, యమధర్మరాజ దివ్యజ్ఞాన పీఠం వద్ద జరిగిన కార్యక్రమంలో అక్షయపాత్ర నిర్వాహకులు రామకృష్ణ మాట్లాడుతూ మానవ జీవితంపై కాకుల ప్రభావం, మృతాత్మలకు కాకులకు గల అవినాభావ సంబంధం, మరణానంతరం జీవులను కాకులు ఏవిధంగా రక్షించి అనుగ్రహిస్తాయో ఆయన వివరించారు. నూకల కుమారి, పోతురాజు కనకదుర్గ, అన్నపూర్ణ, దేవి, స్వరూప, ప్రసాద్, గొవ్వాల అచ్యుతరామయ్య, లింగోలు విస్సు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల బదిలీలు సక్రమం

మామిడికుదురు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 104లో ఉద్యోగుల బదిలీలు అక్రమమంటూ చేస్తున్న ప్రచారం అవాస్తవమని 104లో పనిచేస్తోన్న ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇటీవల సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బదిలీల విషయంపై రీజనల్ మేనేజర్ హిమజతో మాట్లాడారని, 104 ఉద్యోగుల బదిలీలు అక్రమమనడం పూర్తిగా అవాస్తమని, అది అపోహ మాత్రమేనని, ఉద్యోగులందరూ ఎవరి స్థానాల్లో వారు ఆనందంగా ఉద్యోగం చేసుకుంటున్నారని తెలిపారు. 104 ద్వారా పేదలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు వారు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : పీఆర్టీయూ

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో పీఆర్టీయూ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని, అప్పటి వరకు ఐఆర్ 30శాతం ప్రకటించాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులకు ఇచ్చిన స్కూలు బ్యాగులో ఇప్పటివరకు పాడైన వాటి స్థానంలో కొత్తవాటిని ఇవ్వాలని కోరారు. వీటిపై రాష్ట్ర నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతానని సురేష్‌బాబు తెలియచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సంగం బ్రహ్మాజీరావు, మండల శాఖ అధ్యక్షుడు పిల్లి హేమసుందర్, ప్రధాన కార్యదర్శి అల్లూరి మధుసూదనవర్మరాజు, కొణతం శ్రీనివాస్, గంటా రామారావు, బొలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఆర్ఏగా అంకిత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

యానాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యానాం నూతన పరిపాలనాధికారిగా 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అంకిత్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఢిల్లీకి చెందిన అంకిత్ కుమార్ పుదుచ్చేరిలో రెండేళ్ల ట్రైనింగ్ పూర్తి చేశారు. తొలి పోస్టింగ్ యానాం ఆర్ఏగా నియమించారు. పుదుచ్చేరి నుంచి విశాఖపట్నం చేరుకున్న ఆయనకు యానాం సమాచారశాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి యానాం చేరుకున్నారు.

చేనేత సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చేనేత రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగికి శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంతో పాటు చేనేత వస్త్రాల అమ్మకాలపై 30శాతం రిబేటు విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు కార్మికులకు రూ.25వేలు చొప్పున వెంటనే అందించాలని కోరారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన దేవాంగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు నామినేటెడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేయించాలని వినతిపత్రంలో కోరారు. చేనేత రంగ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు.

ఉపకార వేతనం పంపిణీ

అమలాపురంటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): అమలాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోన్న బెజవాడ కల్యాణికి బుధవారం జేసీఐఇండియా ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వాడ్రేవుశ్రీవాణి ఆధ్వర్యంలో రూ.10వేలుఉపకార వేతనాన్ని అందజేశారు. జేసీఐ సభ్యులు ఆకొండి పవన్, వాడ్రేవు శ్రీరామ్, లక్ష్మీనృసిహం, మాకిరెడ్డిమనోజ్ పాల్గొన్నారు.

పరామర్శ

కాట్రేనికోన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కందికుప్పలో పితృవియోగంతో బాధపడుతున్న వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కాశి భరత్ కుటుంబ సభ్యులను బుధవారం వైసీపీ నాయకులు పరామర్శించారు. పల్లం గోపాలరావుపేటలో మృతి చెందిన అయితాబత్తుల అప్పలస్వామి కుటుంబాన్ని వారు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, ఎంపీపీ కోలాటి సత్యవతి, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్‌తదితరులు పరామర్శించారు.

పెనికేరు భూ నోటిఫికేషన్ రద్దు



మహిళకు భూమి దస్తావేజులు అందించిన కలెక్టర్

అమలాపురం,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెనికేరులో ముగ్గురు భూయజమానులకు సంబంధించి ఐదేళ్ల క్రితం 1.72 సెంట్ల భూమిని అప్పటి ప్రభుత్వం సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఆ భూమికి పరిహారం అందించలేదని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈవ్యవహారంపై సమీక్షించారు. ప్రభుత్వం మారడం, జిల్లా విభజన జరగడం వంటి పరిణామాల్లో నష్టపరిహారం అందలేదని, ఆ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు వేరేచోట ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అప్పట్లో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలోఉండే పెనికేరుకు చెందిన కె.సుశీల 50సెంట్లు, గన్ని కృష్ణ 90సెంట్లు, కాకరపర్తి సుజాత 29సెంట్లు భూమిని సేకరించడం జరిగిందని, గత మూడేళ్లుగా భూయజమానులు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో తమకు భూములు అప్పగించాలని కోరుతున్నట్టు తెలిపారు. దీనిపై కలెక్టర్ మహేష్‌కమార్ క్షేత్రస్థాయి నుంచి నివేదిక రప్పించుకుని కొనుగోలు నోటిఫికేషన్ ఉన్నరాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపి ఆనోటిఫికేషన్ రద్దుచేస్తూ ఒరిజినల్ దస్తావేజులను బుధవారం కలెక్టరేట్‌లో ముగ్గురికి అందజేశారు. తహశీల్దార్ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆలయంలో చైర్మన్ పెద్దిరాజు పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానానికి మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అధికారులు అందించారు.

రూ.19వేలు పలికిన గణపతి లడ్డూ

అల్లవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సామంతకుర్రు శ్రీసాయిలక్ష్మీగణపతి ఆలయం వద్ద 12కిలోల గణపతి లడ్డూకు వేలం పాట జరిగింది. కంకిపాటి ప్రసాదరాజు రూ.19వేలకు లడ్డూను దక్కించుకున్నారు. పరసా రాంబాబు, గుంటూరి సత్యనారాయణరాజు, కోడూరి నాగేశ్వరరావు, అప్పలస్వామి, పరసా నారాయణరావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



మామిడికుదురు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరానికి చెందిన వందేళ్ల వృద్ధుడు వాకపల్లి వెంకటరత్నం మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఆయనకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలు సంతానం కాగా 18మంది మనుమలు, 28మంది మునిమనుమలు, 10 మంది అని మనుమలు ఉన్నారు. ఇప్పటివరకు తన పనులు తానే చేసుకునేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

దోమల నిర్మూలనకు చర్యలు

పి.గన్నవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాగుల్లంక పీహెచ్‌సీ పరిధిలో ఉన్న వాడ్రేవుపల్లి గ్రామంలో దోమల నిర్మూలనకు ఎబెట్ మందును పిచికారి చేసినట్లు హెల్త్‌అసిస్టెంట్ ఏడిద కవీంద్ర తెలిపారు. గ్రామంలో ఎంవీఎన్ కాలనీ, మాణిక్యాలమ్మ గుడివీధి, చాకలిపాలెం తదితర ప్రాంతాల్లో మురికినీటి గుంతలు, డ్రైనేజీల్లో ఎబెట్ మందును పిచికారి చేసినట్లు తెలిపారు. అనంతరం దోమల లార్వా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మంగెన వెంకటేశ్వరరావు, స్థానిక టీడీపీ నాయకులు పత్తిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో ప్రకృతి వైద్య నిపుణుడు రవివర్మ పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది ఆలయానికి పుణ్యక్షేత్రానికి ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ రవివర్మ విచ్చేశారు. తొలుత క్షేత్ర పాలకుడు శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పవిత్రోత్సవ పూజా కార్యక్రమాల్లో రవివర్మ పాల్గొన్నారు.

కూటమి పాలనలో మత్స్యకారులకు ప్రాధాన్యం

కాట్రేనికోన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. పల్లంలో మత్స్యకారులకు చేపలు ఎండబెట్టుకోవడానికి స్వరాజ్య అభ్యుదయ సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ.5లక్షల నాబార్డు నిధులతో 5 సోలార్ డ్రయర్లను మత్స్యకార మహిళలకు అందించారు. ఈ ప్రాజెక్టును బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సోమినాయుడు, ఆప్కాబ్ డీడీఎం బాపూజీ, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ, డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, స్వరాజ్య అభ్యుదయ సంస్థ సీఈవో యాళ్ళ పద్మలత, ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకున్న ఐఏఎస్

ముమ్మిడివరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని ఢిల్లీకి చెందిన జాయింట్ సెక్రటరీ డైరెక్టర్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ (ఐఏఎస్) పొలమూరి బాలకిరణ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. తపో ఆశ్రమంలో చిన బాలయోగీశ్వరులు, పెదబాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ఈసందర్భంగా బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు కటికదల నాని ఆయనకు ప్రసాదాన్ని అందించారు.

కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ముమ్మిడివరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పళ్లవారిపాలేనికి చెందిన చిక్కం శ్రీనివాసరావును ముమ్మిడివరం శ్రీవెంకటేశ్వరా కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎ.రాధాకృష్ణరావు నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి కుచర్లపాటి తాతంరాజు తెలిపారు.

గణనాథులకు కుంకుమ పూజలు

అల్లవరం,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి):మొగళ్లమూరి లక్ష్మీగణపతి ఆలయం వద్ద ట్రాక్టర్లు, ట్రక్కు, ఆటోలు, ఓనర్లు, వర్కర్ల ధనసాయంతో భారీ అన్నసమారాధన జరిగింది. బోడసకుర్రు, అల్లవరం,డి.రావులపాలెం, దేవగుప్తం, బెండమూర్లంక, కొమరగిరిపట్నంగ్రామాల్లో గణనాథులకు పూజలు చేశారు.

పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతం

మంత్రి సుభాష్


అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం పట్టణంలో పలు వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రితో పాటు, మున్సిపల్ చైర్పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రామచంద్రపురం పట్టణంలో రూ.5 కోట్లతో డ్రైన్లు, రోడ్లు, పైపులైన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. 9వ వార్డులో రూ.3.80 లక్షలు, 13వ వార్డులో రూ.11.45 లక్షలు, 10లో 3.61 లక్షలు, 16లో రూ.13 లక్షలు, 17లో రూ4.98 లక్షలు, 19లో రూ.15 లక్షలు, 20లో రూ.12.5 లక్షలు, 24లో రూ.14.31 లక్షలు, రూ.26లో రూ. 15 లక్షలు, 27లో రూ.5లక్షలు, 28లో రూ.19 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర రాజు, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, ఎస్కెబీపీ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, మున్సిపల్ డీఈఈ శ్రీకాంత్, ఏఈలు సునీల్, ప్రభాకర్, కూటమి నాయకులు గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కవల నానాజీ, చందమామ వాసు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కోటిపల్లి వద్ద నిలకడగా ఉన్న గోదావరి ప్రవాహం

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

కె.గంగవరం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ప్రవహిస్తున్నది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో పుష్కరాలు రేవు, ఫెర్రీ రేవు వరదనీటితో చిక్కుకున్నాయి. పుష్కరాలు రేవులో పైమెట్ల వద్ద వరద తగ్గడంతో బురద బయటపడుతోంది. పుష్కరాల రేవులో పెద్దమెట్టు బురదతో నిండిపోయింది.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుతుండటంతో మండలంలోని గోదావరి వరదనీరు తగ్గుతున్నది. ఈసారి నిలకడగా కొనసాగుతూ కొద్దికొద్దిగా వరద ప్రవాహం తగ్గుతున్నది. మండలంలోని లంక భూములు, ఆయా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు అలానే కొనసాగుతోంది. జొన్నాడ పుష్కర్ ఘాట్ వద్ద వరద అధికంగానే ఉంది.


వాడపల్లి వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రమణీయం స్వామివారి కల్యాణం

ఆత్రేయపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం, గోపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో స్వామివారి కల్యాణాన్ని అర్చక బృందం రమణీయంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తదనంతరం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టున ఉన్న గణపతి ఆలయంలో బుధవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, లక్షగరిక పూజ జరిపారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆలయ అర్చకులు ఏణ్ణాతుల శ్రీనివాస్, ఓంకార్ తేజ ఆధ్వర్యంలో వేద పండితులు తంగిరాల దత్తాత్రేయ యజ్ఞశర్మ(దత్తు) పర్యవేక్షణలో పలువురు పండితులు స్వామివారికి అభిషేకాలు, పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, లక్షగరిక పూజలను వేదమంత్రోశ్చరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధికసంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



కుట్టుశిక్షణతో కుటుంబానికి అదనపు ఆదాయం

ఆలమూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఆదాయాన్ని పెంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమం చేపట్టిందని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. చొప్పెల్లలో మూడు నెలలపాటు జరిగిన కుట్టుశిక్షణ ఇవ్వడం జరిగిందని దీని ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లు ఇస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాలను తరచూ సందర్శించి సలహాలు అందించిన ఎంపీడీవో సేవలు ప్రశంసిస్తూ ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఆలమూరు నీటి సంఘాల డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, సర్పంచ్ దంగేటి చంద్రకళ, నాయకులు ఆకుల రామకృష్ణ, బళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.


చొప్పెల్లలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఎంపీడీవోను సత్కరిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ టీచర్లకు యాప్‌లపై శిక్షణ

ఆత్రేయపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్‌లపై శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ఆత్రేయపురం ర్యాలి సెక్టార్లకు సంబంధించి టీచర్లకు సూపర్‌వైజర్లు కె.పద్మావతి, సత్యవేణి శిక్షణ అందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా గర్భిణి, బాలింతల వివరాలను నమోదు చేసే ప్రక్రియపై వివరించారు. గతంలో పీహెచ్‌సీ సిబ్బంది నమోదు ప్రక్రియ నిర్వహించేవారు. ప్రస్తుతం ఈ వివరాలను అంగన్‌వాడీ టీచర్లు యాప్‌ల ద్వారా నమోదు చేయాలన్నారు.


ఆత్రేయపురం వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై అవగాహన

కె.గంగవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జన జాగృతి రథం ద్వారా ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్నారులు, మహిళలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కలిగిస్తున్నామని పామర్రు ఎస్ఐ ఎస్‌కె. జానీబాషా చెప్పారు. బుధవారం రాత్రి పామర్రు రంగా సెంటర్‌లో జన జాగృతి రథం ద్వారా 18 రకాల వీడియోలను ప్రదర్శన చేశారు. ప్రజలు వాటిని వీక్షించారు. ఆయా గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామని ఎస్ఐ జానీబాషా చెప్పారు.


వెదురుపాకలో లక్ష్మీగణపతికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీగణపతికి గరికపూజ, హోమం

రాయవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక సవటా సెంటర్‌లో ఉన్న లక్ష్మీగణపతి మండపం వద్ద బుధవారం వినాయకుడికి అభిషేకం, గరికపూజ, హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వేదపండితుడు ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ, అంగర జనార్ధన్ అర్చకత్వంలో జరిగిన కార్యక్రమంలో తొలుత వినాయకుడికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, భక్తులతో లక్ష గరికపూజ, లక్ష్మి గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కోలాటం గురువు కొవ్వూరి ఆదినారాయణరెడ్డిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొవ్వూరి బుల్లి వీర్రెడ్డి, కొవ్వూరి భామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల చేష్టలపై రాజకీయం తగదు

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి. శ్రీనివాస్

కొత్తపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఈతకోటలో కొందరు ఆకతాయిల అల్లర్లను రాజకీయం చేస్తూ కులాలను రెచ్చగొట్టడం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి తగదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.


కూర్మాపురంలో ఏపీపీఎస్సీ డైరెక్టర్ సుధాకర రెడ్డిని సత్కరిస్తున్న హనుమాన్ తదితరులు

కూర్మాపురంలో ఏపీపీఎస్సీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి పర్యటన

రాయవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూర్మాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్టర్ జీవీ సుధాకరరెడ్డి బుధవారం పర్యటించారు. ఏపీపీఎస్సీ డైరెక్టర్ స్నేహితుడు హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్ స్వగృహానికి వచ్చిన ఆయన తన మిత్రులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో కొవ్వూరి త్రినాధరెడ్డి, కూర్మాపురం సొసైటీ త్రిసభ్య కమిటీ మాజీ చైర్మన్ కందర్ప భానుమతి తదితరులు ఉన్నారు.


పెనికేరుకు చెందిన మహిళకు భూమి దస్తావేజులు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పెనికేరు భూ నోటిఫికేషన్ రద్దు

యజమానులకు దస్తావేజులు అందజేత

అమలాపురం,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనికేరులో ముగ్గురు భూ యజమానులకు సంబంధించి ఐదేళ్ల క్రితం 1.72 సెంట్ల భూమిని అప్పటి ప్రభుత్వం సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఆ భూమికి పరిహారం అందించలేదని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ వ్యవహారంపై సమీక్షించారు. ప్రభుత్వం మారడం, జిల్లా విభజన జరగడం వంటి పరిణామాల్లో నష్టపరిహారం అందలేదని, ఆ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు వేరేచోట ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అప్పట్లో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలో ఉండే పెనికేరు గ్రామానికి చెందిన కె.సుశీల 50 సెంట్లు, గన్ని కృష్ణ 90 సెంట్లు, కాకరపర్తి సుజాత 29 సెంట్లు భూమిని సేకరించారని, మూడేళ్లుగా భూ యజమానులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తమకు భూములు అప్పగించాలని కోరుతున్నట్టు తెలిపారు. దీనిపై కలెక్టర్ మహేష్‌కుమార్ క్షేత్రస్థాయి నుంచి నివేదిక రప్పించుకుని కొనుగోలు నోటిఫికేషన్ ఉన్న రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపి ఆ నోటిఫికేషన్ రద్దు చేస్తూ ఒరిజినల్ దస్తావేజులను బుధవారం కలెక్టరేట్‌లో ముగ్గురికి అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో వైద్య శిబిరం

రాయవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోమేశ్వరంలో బుధవారం రాజమండ్రి డెల్టా హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో వద్ద జరిగిన ఈ శిబిరంలో వైద్య బృందం మనోజ్, కాంత్రి కుమార్, రాజు, దొర బాబు, మీరాజ్ తదితరులు పాల్గొని బీపీ, షుగర్, ఈజీసీ తదితర పరీక్షలు నిర్వహించారు.

పారిశుధ్యం అధ్వానం...పట్టించుకోని యంత్రాంగం

• చెత్తకుప్పలతో ప్రజల బెంబేలు • తరచూ రోగాలబారిన పడుతున్నామని గగ్గోలు

కొత్తపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడ చూసినా అపారిశుధ్యం తాండవిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా ప్రాంత ప్రజలు తరచూ అనారోగ్యంతో సతమతమవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. ముఖ్యంగా ఆయా పంచాయతీల పరిధిలో డంపింగ్ యార్డులు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను డంప్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆయా ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్కడ పందులు స్వైర విహారం చేస్తూ మరింత అధ్వానంగా మారుస్తున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. పారిశుధ్యం వారోత్సవాల పేరుతో కొన్ని వీధులను ఎంచుకుని ముగ్గు, బ్లీచింగ్ చల్లి పారిశుధ్యం చేసినట్టు అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాశీనత కనబరుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం కావడంతో తరచూ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తున్నదని ప్రజలు గగ్గోలు పెడుతు న్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి అపారిశుధ్యంపై దృష్టిపెట్టాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


వానపల్లి సుబ్బరాజునగర్‌లో పంటకాలువ పక్కన చెత్త


ఆలమూరు మండలం మోదుకూరులో మాట్లాడుతున్న ఏడీఏ చౌదరి


రాయవరం మండలం వెదురుపాకలో ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్న దృశ్యం


కె.గంగవరం మండలం పేకేరు సభలో మాట్లాడుతున్న ఏడీఏ నాగకుమార్

ఆలమూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరి సాగులో ఎలుకలను సకాలంలో నివారించడం కీలకమని వ్యవసాయశాఖ ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కెవీ చౌదరి సూచించారు. ఆలమూరు మండలం మోదుకూరు, ఆలమూరు, పెదపళ్ల, చొప్పెల్ల గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ మందును రైతులకు పంపిణీ చేశారు. ఎలుకలను సామూహికంగా రైతులు చేపడితే మంచి ఫలితం ఉంటుందని ఏడీఏ వివరించారు. కార్యక్రమంలో ఏవో మీనా, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో అధిక దిగుబడులు

రాయవరం, (ఆంధ్రజ్యోతి): సామూహిక ఎలుకల నిర్మూలనలో రైతులంతా భాగస్వాములై పంటలను ఎలుకల నుంచి కాపాడుకోవాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ, వెదురుపాక సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి కోరారు. బుధవారం వెదురుపాక గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా రైతులకు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ, సర్పంచ్ తదితరులు మాట్లాడారు. ఏవో కేవీఎస్ రమేష్ కుమార్ సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కొవ్వూరి చంటిరెడ్డి, వి.సావరంలో సహకార సంఘం అధ్యక్షుడు పిల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దిగుబడులు సాధించాలంటే ఎలుకల నిర్మూలన జరగాలి

ఏడీఏ నాగకుమార్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): వరి పంటలో దిగుబడులు సాధించడానికి ఎలుకల నిర్మూలన చేయాల్సిందేనని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. బుధవారం ఆయన పేకేరులో జరిగిన సామూహిక ఎలుకల నిర్మూలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన చేయడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుందన్నారు. రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి, టీడీపీ నాయకుడు చలగళ్ల నాగేశ్వరరావు, వీఏఏ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో బి.రవి మాట్లాడుతూ రైతులంతా ఎలుకల నిర్మూలనకు ఏకకాలంలో మందు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది, సొసైటీ చైర్మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): పంట నష్టం కలగకుండా ఉండాలంటే ఎలుకల నివారణ తప్పనిసరి అని ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి అన్నారు. మండలంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలుకల మందు పంపిణీకి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద ఎలుకల మందును పంపిణీ చేశారు. ఆయా సహకార సంఘాల వద్ద సహకార సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, కూటమినేతలు మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


మండపేట మండలం తాపేశ్వరంలో ఎలుకల నివారణ మందు పంపిణీలో పాల్గొన్న అధికారులు

వైభవంగా మహాగణపతి హోమం

ఆత్రేయపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా గణపతి పందిరిలో నిర్వహించిన నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మహాగణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.


మహాగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం


అర్తమూరులో టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అర్తమూరులో టీబీ ముక్త భారత్ ర్యాలీ

మండపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) అర్తమూరులో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో టీబీ గురించి వివరించడంతోపాటు నివారణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలను డాక్టర్ శారా వెస్లి తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.వీ.రెడ్డి, సహకార సంఘ అధ్యక్షుడు పి.రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, వైద్య సిబ్బంది విజయకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్‌టీయూ కృషి

కె.గంగవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ అన్నారు. బుధవారం ఆయన కుందూరు, గంగవరం, పామర్రు, సుందరపల్లి, కోటిపల్లి తదితర ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు జరి పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓదూరి వెంకట రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అమృతరావు, కడియాల గోవింద రాజు, నాళం శ్రీనివాసరావు, బళ్ల దమరుక నాథం, షేక్ నౌషాద్, డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు నవజనార్దనస్వామి ఆలయ పాలకవర్గం

ఆలయం అభివృద్ధికి కృషి

ఆలమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నవజనార్దనస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తూ భక్తులకు మెరుగైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భైరిశెట్టి రాంబాబు, సభ్యులు అన్నారు. నూతన పాలకవర్గ సమావేశం అనంతరం తొలిసమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో నరేంద్రకుమార్, అర్చకులు ప్రభాకరాచార్యులు, భగవాన్‌లతో పాలకవర్గం ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ప్రతీ శనివారం ఆలయంలో భక్తుల సహకారంతో ప్రసాదం వితరణ, తోమాల సేవ నిర్వహించనున్నట్లు తీర్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఈతకోటలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈతకోటలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం నాటి ఘటనలో బాధితులైన వారిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడిన చిన్నారిని, మరో ఇద్దరిని ఈతకోటలో వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఘటనను ఖండిస్తున్నామన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ ఘటనకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. కొందరు చేసిన ఇటువంటి చర్యలను పవన్‌కల్యాణ్‌కు, నాయకులకు ఆపాదించడం సరికాదన్నారు.

మంత్రి పరామర్శ

రావులపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజును మంత్రి సుభాష్ పరామర్శించారు. ఇటీవల ఆలమూరులో అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవంలో సతీష్‌రాజు గాయపడగా, కాలికు ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం రావులపాలెంలో సతీష్‌రాజు స్వగృహంలో ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, కోట వెంకటేశ్వరరావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాగేంద్రకు గౌడనేతల పరామర్శ

ఆత్రేయపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్రను బుధవారం ర్యాలిలో రాష్ట్ర గౌడ సంఘ నేతలు పరామర్శించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, గౌడ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రంగారావు, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణగౌడ్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ తదితరులు పరామర్శించారు.